# ఆమె పేరు అమ్మ

## 1

తన భర్తతోడిదే లోకం-అనుకొన్నది ఆయిల్లాలు.ఆయన అసామాన్య వ్యక్తి-అని భావించింది. ఆయనెప్పుడూ తప్పు చెయ్యడని నమ్మింది. ఆప్తబంధువులు - ఆయన ఖర్చుల్ని గురించీ, అనాలోచిత వ్యవహారాలను గురించీ మొదట ముచ్చటించి, తరవాత హెచ్చరించినప్పుడు - పెడచెవినిబెట్టింది. జానికమ్మకు భర్తతోడిదేలోకం - ఆనాటి వరకూ.

నిండా నలభైయేళ్ళు నిండని భర్త, ముగ్గురు మగబిడ్డల్నీ, తననూ అనాథల్ని చేసి చనిపోయినప్పుడుగాని ఆమెకు భర్త చేసిన సాహస కార్యాల సంగతి పూర్తిగా తెలియరాలేదు. ఆమె ఏడ్చింది, ఏడ్చింది. రానున్న కష్ట దినాలకువెరచి ఏడుస్తున్నదని అనుకొన్నారు - తెలిసిన వాళ్ళు. ఉన్న రోజుల్లో భర్తను అదుపులో పెట్టక, ముసురు దినానికని యింత ముల్లెవెనక వేయలేక పోతినని - ఏడుస్తున్నదని బంధువులనుకొన్నారు. కాని - ఆమె ఏడుస్తున్నది భర్తకోసం. అతనితోడిదే ఆమె లోకం.

పదవరోజున - ఆమె జుట్టు తీసి వేయించారు. ఆమె విధవరాలయింది. మూడవవాడు - (రెండేళ్ళు నిండలేదు వాడికి) - యీ కొత్త అమ్మను చూసి జడుసుకొన్నాడు. జ్వరం వచ్చింది. ఆమె దుఃఖం భర్తనుంచి బిడ్డలమీదికి

సోకడానికి ఆ చిట్టివాడి జ్వరమే కారణం. మొదటిసారిగా. తన ముగ్గురుబిడ్డల చీకటి భవిష్యత్తును గురించి భయపడ్డది. మొదటిసారిగా తన భర్త-స్వార్జితమూ, పిత్రార్జితమూ అయిన ఆస్తిని ఎన్ని విధాల ముందాలోచనలు లేక తగులబెట్టాడో, పదిమందీ వ్యాఖ్యానిస్తుండగా శాంతంగా విన్నది. ఆమెకన్నీ తెలిసివచ్చినవి. ఉన్న యిల్లు తమది గాదు. పొలం, తోట అప్పులవాళ్ళ అధీనానికి పోతున్నవి. ఇంట్లో బంగారు సొమ్ము బ్యాంకి తనఖాలో వున్నది. మిగిలివున్నదింకా బోలెడంత అప్పు. ఇక ఆమెభర్తను గురించి ఏడుస్తూన్నపుడు అయన హ్రస్వదృష్టిని గూడా అర్థం చేసుకొంటూ ఏడ్చింది.

జానికమ్మ అక్కగారువచ్చి అన్నది —"జానకీ—ఏడిస్తే చచ్చినవాళ్లు తిరిగిరారుగదా. గుండె రాయిచేసుకొని నీ బిడ్డల్ని చూసుకో. ఆస్తంతా తనతో తీసుకెళ్ళాడేమోగాని, నీకీ మూడు మాణిక్యాల్నీ మిగిల్చిపోయాడు. సానబెడితే యివి మణిదీపాలవుతాయ్. నీ కష్టాలు తీర్చేది నీ మగబిడ్డలేనే జానకీ!" జానికమ్మకు ఆనాటినుంచీ తనబిడ్డల తోడిదేలోకం.

బిడ్డలకోసం ఆమె యమచెఱలు అనుభవించింది. "జానికమ్మా! నీకేం భయమమ్మా చూస్తూండగానే నీ బిడ్డలెక్కివచ్చి ఆదుకుంటారు"—అని పొరుగువాళ్ళు ఆదరించే వాళ్ళు. తన భర్తనుండి సహాయంపొందిన బంధువులు గూడా, యీ కష్టాల్లో వీసమెత్తుమాట సహాయానికిగూడా రాలేదు. "ఎందుకేడుస్తావ్ జానికమ్మా. మగబిడ్డల తల్లివి. అదృష్టమంటేనీది. ఆబిడ్డలు పెరిగితే నీకిక దిగులుంటుందా?" అని పిల్లలుగల పక్కయింటి తల్లి ఓదార్చేది. ఆ పది హేనేళ్ళు ఆమె లోకపు యీసడింపుల్ని, క్రౌర్యాన్ని మరిచిపోయింది. ఆమెకు బిడ్డలతోడిదే లోకం. వేరొక చైతన్యంలేదు.

వాళ్ళింటి ఎదుటి డాబాలో కోమట్లుండేవాళ్ళు. కోమటి సుబ్బమ్మకొడుకు గురునాథం అప్పుడప్పుడు జానికమ్మ బిడ్డలతో వచ్చీరాని కబుర్లు చెప్పించేవాడు. ఈ కోమట్లు పేదరికపు అష్టకష్టాలు అనుభవించి యిప్పుడిప్పుడే దిగులు లేని మనుషులుగా తిరుగుతున్నారు. జానికమ్మ బిడ్డల్ని పలకరించేందుకు-పునుగులమ్మి, పస్తులుండి, నేడు పల్లకీ ఎక్కగల గురునాధానికి తలవంపులు కాలేదు.

"పెద్దబ్బాయ్-నువ్వు చదువుకొని పెద్దాడివైతే ఏంజేస్తావ్, పెద్దబ్బాయ్!"

"కలెక్తరు" అని జంకు లేకుండా పెద్దబ్బాయి సమాధానం చెప్పాడు.

"నువ్వో చిన్నబ్బాయ్!"

"పోలీస్...ఎల్లబుట్ట"

"అబ్బో-బాబో-జానకమ్మగారో! చిన్నబ్బాయిని జూస్తే నాకుభయమేస్తు న్నదండీ."

కోమటి సుబ్బమ్మ వచ్చి- బుల్లివాడి చేతిలో మిఠాయి బెట్టి—"నువ్వేం జేస్తావో మనవడా" అంది. బుల్లివాడికి మాటలు రాక అమ్మ ఒళ్ళో దూరాడు.

గురునాథం నవ్వుకొని ఆశీర్వదించుకుంటూ అన్నాడు—"అమ్మగారూ, చూస్తూండండి. నీ కొడుకులు ఎక్కొస్తే అబ్బ ఆస్తినంతా తిరిగి కొంటారో లేదో. అసాయిద్దుగులుగారమ్మా ముగ్గురికి ముగ్గురూ!"

జానకమ్మ కళ్ళ నీళ్ళు వత్తుకొన్నది. బిడ్డలు లేనిలోకం ఆమెదిగాదు. తన బిడ్డలే తన సర్వం. ఇంకో పదేళ్ళు యీ కష్టాలు—అనుకుందామె.

## 2

పెద్దవాడు హైస్కూలు గట్టెక్కితే చెన్నకేశవులికి అష్టోత్తర నామపూజ చేయించుకొంటానని మొక్కుకొన్నది జానకమ్మ.

వాడు ప్యాసయినాడు. కాని ఆమె చేతిలో చిల్లిగాని లేదు. ఏ అయ్య కడుపులోనో యింత దయపుట్టి పిల్లవాణ్ని కాలేజిలో చేర్పిస్తే, సహస్రనామ పూజ చేయించుకొంటానంది. మేనమామ వచ్చి-"పెద్దవాణ్ణి బియ్యేదాకా చదివించే బాధ్యత నాది అక్కయ్యా-" అన్నాడు. ఆమె చేతిలో ఎర్రని ఏగాని లేదు. అయితే నేం? చెన్నకేశవులికి కోపం రాలేదు. పిల్లవాడు కాలేజీలో చేరాడు. కోమటి సుబ్బమ్మ అన్నది- "కలెట్టరీ చేస్తాడమ్మా.బాలవాక్కు బ్రహ్మవాక్కు."

జానికమ్మ వెనక సంవత్సరాలు లెక్కించింది. ఆ లెక్కలో ఆమె తల నెఱిసింది. ముడతలు పడి ముఖం కాలంబరువును కొలుస్తున్నట్లయింది. ముంజేతి చర్మం గూడా ముడతలు పడ్డది. ఇప్పుడామె నెలలు లెక్కిస్తున్నది. పెద్దవాడు బియ్యేలో వున్నాడు. రెండోవాడు వారాలు చేసుకొంటున్నా బాగా మార్కులు తెచ్చుకొని స్కూలు ఫైనలు దాకా నెట్టుకొచ్చాడు. మూడోవాడు తర్డుఫారంచదువుతున్నాడు. గొడ్రాళ్లుగాని తల్లులు, పిల్లలగన్న తల్లులు చల్లని వేళల "నీ కష్టాలు తీరుతై జానికమ్మా! నీ బిడ్డలు చెట్టంత వాళ్ళవుతారు. జానకమ్మా!" అని దీవించిన దీవెనెల నామె మూట గట్టుకొన్నది. సంజెవేళ దీపం బెడుతూ, తన బిడ్డలను దీవించిన తల్లులకు తండ్రులకు చేయెత్తి నమస్కారం చేయని దినం లేదు. చెన్నకేశుడికి పడ్డ బాకీలన్నీ పెద్దకొడుకు వుద్యోగంలోకి రాగానే తీరుస్తానని చెంపలు వేసుకొని క్షమాపణలు వేడుకోని

దినంలేదు. రెండుమూడునాళ్ళు వరుసగా వస్తులున్న బాధ, తలనొప్పి వేధిస్తున్నా జానకమ్మ ఈ దైనందిన కార్యక్రమం మరిచిపోలేదు.

పెద్దకొడుకు పరీక్షలకుముందు యింటికొచ్చినప్పుడు ఒక్క అణా సంపాదించి పెరుగుకొని వడ్డిస్తూ అడిగింది-

"నాన్నా, పరీక్ష బాగా వ్రాసి తల్లి కష్టాలు తీరుస్తావుకదూ? తమ్ముళ్ళను మర్చిపోవుగదూ నా తండ్రీ."

"అమ్మా, లోకంలో తల్లుల కన్నీళ్ళు తుడవటానికేనమ్మా నే చదువు తున్నది- నా తమ్ములేగాదు. లోకంలో ఏ తమ్ముణ్నీ మర్చిపోనే అమ్మా."

జానకమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకొన్నది. పెద్ద కొడుకు అంత గంభీ రంగా ఆప్యాయంగా యిదివరకెప్పుడూ మాట్లాడి ఎరగడు. ఎప్పుడూ ముభా వంగావుండే స్వభావం పెద్దవాడిది.

సెలవలయిపోయి పరీక్షలకని పెద్దవాడు తిరిగి కాలేజిలో చేరిన వారం పది రోజులకు జానికమ్మ తమ్ముడు గుండె బాదుకుంటూ వచ్చాడు. "చూశావా జానికమ్మక్కా? నీ పెద్దకొడుకు నా కొంప ముంచేశాడు. చూశావా? నీ కొంప నాకొంప అందరి కొంపలు నిలువునా ముంచేశాడే జానికమ్మా!"

"ఏం చేశాడ్రా తమ్ముడూ?" అని ఆమె నిశ్చేష్టురాలైపోయింది.

"చేయాల్సిందే చేశాడు. రవి అస్తమించని బ్రిటీషు తెల్లదొరల రాజ్యం మీదే కత్తి కట్టాడే తల్లీ. యుద్ధంలో చేరొద్దని రిక్రూటింగు ఆఫీసుల్దగ్గిర రహ స్యంగా ప్రచారం సాగించాట్టే - వీడి తెలివి మండ, పోలీసులు బేడీలు తగి లించి తీసికెళ్ళారే అక్కా? నా కూతుర్నిచ్చి యింకా వీణ్ణి వెలగబెడదామను కొన్నాగదుటే."

ఆరాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత ఎవరో యిద్దరు కుఱ్ఱవాళ్ళు వచ్చారు. జానికమ్మను - ఆ రోజున ఏ చల్లనితల్లీ పలకరించ సాహసించలేక పోయింది. ఒక్క మాటతో, ఒక్క పదంతో ఆమె గుండె ఆగిపోతుందేమో నన్నట్టుగా వుంది. కాని ఆ కుఱ్రవాళ్ళు - పెద్దవాడి తోడివాళ్ళట - ఆమెను ఓదార్చారు. "ఎందుకమ్మా ఏడవటం? భారతమాత సుపుత్రుడమ్మా మీవాడు. ఆ ధైర్యం మాకు కూడా లేదమ్మా. తెల్లదొరతనం తుదముడితేగాని, తల్లుల శోకం తీరదన్నాడమ్మా. మీరు గర్వపడాలిగాని అధైర్యం కూడదమ్మా."

"నాయనా! నా బిడ్డను చూడనిస్తారా?"

"రేపు! సబ్ జైల్లోనే వున్నాడింకా. మేజిస్ట్రేటు ముసలాయన. ఆయన్ని పట్టి పోదాం అమ్మా."

జానికమ్మ జైల్లో పెద్ద కొడుకును చూసింది. అతని కళ్ళల్లో అధైర్యం లేదు. అసంతృప్తి లేదు. పశ్చాత్తాపం లేదు. ఆ నిశ్చల విగ్రహాన్ని చూచి జానికమ్మ తన ఏడుపు మింగుకొన్నది.

"ఎందుకు చేశా తండ్రీ ఈ పిచ్చి పని? నీ తల్లి కడుపున కోత పెడతావా? నీమీద ఆశలు పెట్టుకొన్న అమ్మను, తమ్ముళ్ళను అన్యాయం చేస్తావా?"

జానికమ్మ పెద్దకొడుకు సమాధానం చెప్పలేదు. జైలు కటకటాల్లో చేయిదూర్చి తల్లి భుజాన్ని తాకాడు. ఆమె కప్పుడు జ్ఞాపక మొచ్చినై - ఆ రోజున కొడుకు చెప్పిన - ముక్కలు "అమ్మా లోకంలో తల్లుల కన్నీళ్ళు తుడవటానికేనమ్మా నా చదువు! లోకంలో ఏ తమ్ముడినీ మర్చిపోనే అమ్మా."

## 3

"పెద్దపిల్లవాడు అట్లా చేశాడని దిగులుపడిపోతావుటమ్మా. నీ రెండో కొడుకు చూడు - ఇంకో సంవత్సరంలో వుద్యోగం సంపాదించి కుటుంబ పోషణ చేస్తాడో లేదో-" అని కారుణ్యమూర్తులైన తల్లులు జానికమ్మను ఓదార్చారు. కోమటి సుబ్బమ్మవచ్చి - "జానికమ్మా - నీ రెండో కొడుకు తెలివిగలవాడు. కానీ డబ్బిస్తే దాచుకుంటాడేగాని ఖర్చు బెట్టడు. మీ యిల్లు బాగుచేసే కొడుకు" అన్నది. దయామయుల మాటలకు జానికమ్మ కళ్ళు అర్ధ్రమైనా బదులు చెప్పేదిగాదు.

అప్పుడప్పుడు వార్తా పత్రికలు చదివినవాళ్ళు - మీ పెద్దవాణ్ణి విడుదల చేశారనో, మళ్ళీ పట్టుకెళ్ళారనో - జానికమ్మకు చెప్పేవారు. ఒకసారి ఒకబ్బాయి పేపరు తెచ్చి తన కొడుకు జైలునుంచి దొంగతనంగా దేశ భక్తులకు వ్రాసిన జాబు చదివి వినిపించాడు. జానకమ్మ కళ్లు అర్ధ్రమైనాయి.

రెండోవాడు స్కూలుఫైనలు చదువు పూర్తిచేశాడు. వెనకటి రోజుల్లో అయితే తమ్ముళ్ళిద్దరూ-"అమ్మా అన్నయ్య నెందుకు పట్టుకెళ్ళారు? అన్నయ్యెప్పుడొస్తాడు?" అని ప్రశ్నలు కురిపించేవాళ్ళు. బజార్లో వాళ్లు తిరుగుతున్నప్పుడు, అన్నయ్య వీరకృత్యాలు ఎవరైనా పత్రికలు చదివి బిగ్గరగా మాట్లాడుకుంటుంటే, నిశ్శబ్దంగా విని వచ్చేవాళ్ళు. తల్లికి గూడా ఆ సంగతుల హెచ్చరిక చేసేవాళ్ళు గాదు.

మేనమామ - కాళ్ళరిగేట్లు తిరిగి తిరిగి - రెండో వాడికి వుద్యోగం యిప్పించాడు. ఏదో తెస్తున్నాడు. కుటుంబం సాఫీ మార్గంలో జరిగిపోయేట్లుగా వుంది. మూడోవాడూ చదువుకుంటున్నాడు - చక్కగానే. రెండేళ్లు తిరుగు

తూండగా - "అమ్మా, వుద్యోగం చేయలేనే" - అని ఆమె కాళ్ళవద్ద కూల బడ్డాడు - కొడుకు.

భయంతో ఆమె కొడుకు కళ్ళవంక చూచింది. రాత్రిళ్ళు పొద్దుబోయినా చెరువు పక్క సత్రం లోపలి వరండాలో సాధువులు, సన్యాసుల్తో కూచుని నిశ్శబ్దంగా యింటికొచ్చి రెండు మెతుకులు కొరికి నిద్రబోయినట్లుగా నటించే తన బిడ్డ సంగతి తల్లికి పూర్తిగా తెలుసు.

"నాయనా, నువ్వు పెళ్ళి చేసుకో. ఒక యింటివాడివై తమ్ముణ్ణి వుద్ధరించాలి. వుద్యోగం చెయ్యకపోతే ఎట్లా నాన్నా."

"నీకు తెలీదమ్మా! నాకు దేనిమీదా యిష్టంలేదు."

ఈ సంభాషణ జరిగిన మూడో నెలలోనే రెండోవాడు అయిపులేకుండా వెళ్ళాడు. ఆ తర్వాత పుకార్లు, కథలు, కట్టుకథలు చాలా బయలుదేరినై. గురునాథం వచ్చి చెప్పాడు - బ్రహ్మంగారి మఠంలో కనబడ్డట్లు పొన్నూరి బత్తు డొకాయన చెప్పాడమ్మగారూ.

ఈ మాటు ఆమె కళ్ళ ఆర్ద్రం గూడా కాలేదు.

"గురునాథం. నా పెద్ద కొడుకుని చూడాలి నాయనా. వుత్తరంముక్క వ్రాయిస్తావా?"

గురునాథం పేపర్లు చదివే వాళ్ళని పట్టి ఏదో చిరునామాకు జాబు వ్రాశాడు. కాని అది ఎవరి కందిందీ తెలియలేదు. సుబ్బమ్మకు ఇప్పుడు కళ్ళ చూపు బొత్తుగా పోయింది. కర్ర పోటు వేసుకుంటూ వచ్చి - "జానికమ్మా, మీ కుటుంబంలో వున్న పోలికే - యీ సన్యాసుల్లో కలవటం. మీ పినమామ గారొకాయనసాధువుల్లో కలిసిపొయ్యాడుగా.అప్పటికి వడుగుగూడా కాలేదుగా."

జానకమ్మ ఎవ్వరితోనూ విస్తారంగా మాట్లాడలేదు. మూడో వాడికి, తన స్వంత తమ్ముడు చేస్తున్న సాహాయ్యంతో వండి పెట్టుకుంటూ చదివిస్తు న్నది. ఎంత గారాబుగా పెరిగినా వాడు పరీక్షల్లో తప్పలేదు. అన్నిట్లోనూ ఫస్టు మార్కులే. జానికమ్మ కష్టాలు తీర్చేది - చిన్న బిడ్డే నమ్మా అన్నారు దయగల తల్లులు.

ఒక రోజున హఠాత్తుగా పెద్ద కొడుకు వచ్చాడు. అతగాడ్ని చూట్టానికి చుట్టుపక్కల గ్రామాల నాయకులు ప్రజలు చాలామంది వచ్చారు. ఆ దినమల్లా అతనికి తీరనేలేదు. తల్లితో మాట్లాడే అవకాశమే లేదు. చివరికి భోజనం గూడా అక్కడ తిననీయలేదు జనం. వెళ్తూ వెళ్తూ కొడుకన్నాడు: "అమ్మా,

ఏమిటిట్లా అయిపోతున్నావ్. తమ్ముడుపొ రపాటువని చేశాడని నా వుద్దేశం బాలగంగార తిలక్ వ్రాసిన గీతా రహస్యం చదువమ్మా."

చిన్న కొడుకు ఏదో పెద్ద పరీక్షే పాసయినాడని అందరూ అన్నారు.

"నాయనా, నువ్వు వుద్యోగ ప్రయత్నం చెయ్యవేం బాబూ" అని తల్లి అడిగింది; అప్పటి కామెకు కొద్దిగా చూపు నష్టం; చెముడు; పళ్ళు కొన్ని వూడినవి. చిన్న కొడుకు సమాధానం చెప్పాడు. "ఈ వుద్యోగాలు కాదమ్మా, పేపర్లో వ్రాసే పని, దానికి అయిదా రేళ్ళు శ్రమపడాలి."

"అప్పటిదాకా నాయనా?"

"నిజమే జానెడు పొట్ట నిండకపోతుందా? పత్రికలో పనంటే - అది నోమువంటిదమ్మా."

"మంచిది నాయనా."

## 4

ఐదేళ్ళు పట్నాల్లో నగరాల్లోవుండి పని నేర్చుకొన్న మూడో కొడుకును, విదేశాల్లో ప్రత్యేక విలేఖరిగా పత్రికల వాళ్ళు పంపించనున్నారు. తల్లికి శుభ వార్త తెలియజెప్పి పోదామని ఐదేళ్ళ తర్వాత వచ్చాడు.

ఆమె అన్నది. "మంచిది నాయనా!" కాని ఆమె కొడుకు చేతుల్లోనే ఒరిగి పోయింది. గురునాథం వచ్చి - "ప్రాణం పోయింది" అని కొడుకుకు జ్ఞప్తి చేశాడు.

* * *

శవదహన సమయానికి ముగ్గురు కొడుకులూ వున్నారు. ఉత్తరదేశం నుంచి పెద్ద కొడుకు, దక్షిణంలో ఏదో ఆశ్రమంనుంచి రెండోవాడు వచ్చి చేరారు. ఆమె శవాన్ని ముగ్గురు కొడుకులూ, తమ్ముడూ మోశారు. ఆమె శవం వెంట పదివేలమంది మనుషులు నడిచారు. శ్మశాన వాటిదగ్గర పెద్ద బహిరంగసభ జరిగింది.

"ఆమెకేమి? మహా యిల్లాలు. రత్న మాణిక్యాల్లాంటి ముగ్గురు బిడ్డల్ని కన్నది. జన్మంటే సార్థక జన్మ" అని దయగలవారందరూ, చల్లనివేళ అన్నారు. గురునాథం యింటికొచ్చి మంచంలో వున్న తల్లితో చెప్పాడు; "అమ్మా జానికమ్మ చచ్చిపోయింది."

సుబ్బమ్మ అన్నది - "అమ్మ చచ్చిపోయిందీ?" ○

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
29-8-1956